నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

శనివారం | అక్టోబర్ 19, 2024 | www.navatelangana.com

ఎస్సారెస్పీకి పెరిగిన వరద




- 2 గేట్లు తెరిచి దిగువకు నీటి విడుదల

నవతెలంగాణ-మెండోరా

పోచంపాడ్ శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద ప్రవాహం పెరగడంతో ప్రాజెక్టు మూడు స్పిల్‌వే గేట్లను ఎత్తి గోదావరిలోకి 9,372 క్యూసెక్కుల నీటిని వదులుతు వరద కాలువ (ఫ్లడ్ ఫ్లో) 2 గేట్లు తెరిచి 6248 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు అధికారులు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుండి 23826 క్యూసెక్కుల వరద నిరు ప్రాజెక్టులోకి చేరుతుండటంతో కాకతీయ కాలువ ద్వార 5,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2200 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీరు వదులుతూ మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,091(80.5 టీఎంసీలు) అడుగులతో నిండుకుండలా పూర్తి స్థాయిలో నిండుకుని ఉంది.

ఫైనాన్షియర్ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఫైనాన్సియర్ వేధింపులు తాళలేక చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 6వ పోలీస్‌స్టేషన్ శుక్రవారం వెలుగుజూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. నగర శివారులోని నెహ్రూ నగర్‌కు చెందిన షేక్ ఖయ్యూం (48) మూడు సంవత్సరాల క్రితం ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో ఇంటిపైన మార్ట్‌గేజ్‌లోన్ తీసుకున్నారు. ఈ క్రమంలోనే అతనికి పక్షవాతంతో అనారోగ్యానికి గురైయ్యాడు. గత మూడు నెలలుగా ఫైనాన్స్ కట్టకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ వారు ఇంటికి వచ్చి ఫైనాన్స్ కట్టని యెడల ఇంటిని జప్తు చేయిస్తామని బెదిరింపులకు పాల్పడినట్టు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన ఈ నెల 16వ తేదీనా ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయి తిరిగిరాలేదు.

వివరాలు మెయిన్‌లో..

అటకెక్కిన రుణమాఫీ

- సప్పుడు చేయని పాలకులు, అధికారులు
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- సాంకేతిక తప్పిదాలతో అనేక మందికి దూరం
- దరఖాస్తులు సమర్పించినా ఇప్పటివరకు మాఫీ కానీ వైనం
- కేవలం 55 శాతం మందికే రుణమాఫీ

నవతెలంగాణ-నిజాంసాగర్

రైతు రుణమాఫీ పట్ల అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఈ పథకం అమలు చేసిన సమయంలో అనేక సాంకేతిక కారణాలతో చాలా మంది రైతులు తమ రుణాల మాఫీకి దూరమైయ్యారు. దీంతో ప్రభుత్వం స్పందించి రుణమాఫీ కాని రైతుల వివరాలు, కుటుంబీకుల ఫోటో మ్యాపింగ్ చేపట్టి పూర్తి వివరాలు సేకరించింది. దీంతో సర్వే పూర్తయిందికాబట్టి తమకు రుణమాఫీ వరిస్తుందని రైతులు ఎదురుచూస్తున్నా.. మాఫీ మాత్రం కావడం లేదు. దీంతో కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. మాఫీపై కేవలం ప్రకటనలకే పరిమితం కావడంతో ఈ పథకాన్ని అటకెక్కించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం కేవలం 55 శాతం మంది రైతులకు రుణమాఫీ కావడం గమనార్హం.

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలో మూడు సొసైటీలున్నాయి. వీటి పరిధిలోని మొత్తం 9,040 మంది రైతులు వివిధ బ్యాంకులలో రెండు లక్షల లోపు రుణమాఫీ తీసుకోగా దానిలో నుండి కేవలం 4,732 మందికి మాత్రమే రుణమాఫీ అయ్యింది. ఇంకా 4308 మందికి రుణమాఫీ కావాల్సి ఉంది. రుణమాఫీకి సంబంధించి కార్యాలయానికి వెళ్లినా అధికారుల దగ్గర సమాధానం లేకపోవడంతో రుణమాఫీ కాదని భయం అన్నదాతల్లో నెలకొంటుంది.

మండలంలో రుణమాఫీ జరిగిన వారు సంతోషంగా ఉండి కొత్తగా రుణాలు తీసుకొనగా వివిధ కారణాలతో రుణ మాఫీ కాని రైతుల బాధలు మాత్రం ఇంకా తీరడం లేదు. రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమై దాదాపు రెండు నెలల గడిచిపోయినా ఇంకా పూర్తి స్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరించిన వ్యవసాయ శాఖ అధికారులు వారి జాబితాను ప్రభుత్వానికి అందించారు. ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి సమాచారం రైతులకు గాని అధికారులకు గానీ రాకపోవడంతో మాఫీ అవుతుందా లేదా అనే అనుమానం వారిలో ఆందోళన వ్యక్తం అవుతుంది. మండలంలో రెండు లక్షల లోపు రుణం ఉన్న వారిలో మాఫీ ప్రక్రియలు వివిధ సాంకేతిక తప్పిదాలు చోటు చేసుకోగా ఇంకా మాఫీ కాకపోవడంతో వారు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు మూడు విడుతలుగా నిధులు రైతుల ఖాతల్లో జమ చేశారు.



రుణమాఫీ కోసం తమ వివరాలు అందజేస్తున్న రైతులు(ఫైల్)

అన్ని వివరాలు అందజేసినా..

సొసైటీలో, బ్యాంకుల్లో అధికారులు చేసిన తప్పిదాలకు రైతులు రుణమాఫీకి దూరమవుతున్నారు. అర్హులందరికీ రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించి రుణమాఫీ కాని రైతు కుటుంబాల వివరాలు నమోదు చేయించింది. ఆ వివరాలు నమోదు చేసేందుకు ఆన్‌లైన్‌లో సైట్ ఓపెన్ కాలేదు. దీంతో మ్యాన్‌వల్‌గా ఎంట్రీ చేసి ఉన్నతాధికారులకు పంపారు. వివరాలు అన్ని అందజేసినా.. ప్రభుత్వం నుంచి మాత్రం స్పందన రావడం లేదని అధికారులు రైతులకు చెప్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రుణమాఫీకి సంబంధించిన ప్రక్రియను త్వరగా మొదలుపెట్టి రుణమాఫీని చేయాల్సిందిగా రైతులు వేడుకుంటున్నారు. గత ప్రభుత్వంలో రుణమాఫీకి సంబంధించి పేర్ల తప్పులను సరి చేయడానికి సిఎల్‌డబ్లు పోర్టల్‌లో ముందస్తుగా బ్యాంకు వాళ్లకి అగ్రికల్చరల్ ఆఫీసర్‌కి ఎడిట్ ఆప్షన్ ని ఇచ్చారు. కానీ ఈసారి ఎలాంటి ఆప్షన్ ఇవ్వకపోవడంతో రైతులందరూ ఆందోళన చెందుతున్నారు.

రుణమాఫీ కాలే.. రైతుభరోసా రాలే

ఒంటరి నారాయణరెడ్డి



నేను ఆంధ్రబ్యాంకులో ఒక లక్ష 40 వేల రూపాయల రుణాన్ని తీసుకున్నాను. పేరు నమోదులో అధికారుల తప్పిదం వల్ల ఇప్పటికీ నాకు రుణమాఫీ కాలేదు. నా వివరాలన్నీ అగ్రికల్చర్ ఆఫీసర్‌కి అందజేశాను. ఆయన ఇప్పటివరకు రుణమాఫీకి సంబంధించి ఎలాంటి సమాచారం ఎవరు కూడా ఇవ్వడం లేదు. రుణమాఫీ అవుతుందో లేదో అనే నమ్మకం కూడా లేకుండా పోతుంది. గత ప్రభుత్వంలో రైతుబంధు కింద ఎకరానికి 5000 చొప్పున ఇచ్చేవారు కానీ ఈ ప్రభుత్వంలో రుణమాఫీ చేయకపోగా రైతుబంధు కూడా ఇవ్వడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రుణమాఫీ చేసి రైతుభరోసా నిధులు విడుదల చేయాలి.

పెట్టుబడులకు అప్పులు

బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పట్లోళ్ల దుర్గారెడ్డి నిజాంసాగర్



మా ప్రభుత్వంలో నారుమడులు వేసుకోకముందే రైతుబంధు కింద ప్రతి ఒక్క రైతుకు ఎలాంటి కొర్రీలు లేకుండా ఎకరానికి 5000 చొప్పున రైతుబంధును ఇచ్చాం. కానీ ఈ ప్రభుత్వంలో రైతుబంధు ఇవ్వకపోగా రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి చేయకపోవడం చాలా బాధాకరమైన విషయం. రైతులకు పెట్టుబడులకు డబ్బులు లేక అన్నదాతలు బంగారం, పొలం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి మరి పొలాన్ని సాగు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రుణమాఫీ కానీ రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నాను.



కేజీబీవీలో అమానుషం

- సిబ్బంది బంగారు గోలుసు పోవడంతో అంజనం కోసం విద్యార్థిని తీసుకెళ్లిన వైనం
- గజగజా వణికిపోయిన బాలిక
- సిబ్బంది మూఢత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాలు

నవతెలంగాణ-మాక్లూర్

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ కేజీబీవీలో అమానుష ఘటన చోటుచేసుకుంది. సిబ్బంది బంగారు గోలుసు పోవడంతో ఎవరు చోరీ చేశారో తెలుసుకోడానికి విద్యార్థినిని అంజనం వేసేందుకు నిజామాబాద్‌కు తరలించారు. దీంతో విద్యార్థిని భయందోళనకు గురైంది. ఈ ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగుజూసింది. వివరాల్లోకి వెళ్తే.. మాక్లూర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి, సిబ్బంది మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. రెండు నెలల నుండి రోజుకు ఒక్క సంఘటన. ఒక వక్క క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు విచారణ చేపడుతున్న క్రమంలో తాజాగా పాఠశాల సిబ్బంది చైన్ పోయిందన్న విషయంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అంజనం వేయడానికి తీసుకెళ్లిన సంఘటన కలకలం రేపింది. కేజీబీవీలో సీఆర్టీ బంగారు గొలుసు పోయిందని విద్యార్థులను స్పెషల్ ఆఫీసర్ భయాందోళనకు గురిచేసినట్టు సమాచారం. దీంతో ఆటోలో ఓ విద్యార్థినిని నిజామాబాద్‌కు తరలించి విద్యార్థిని చేతికి పసరు పూసి అంజనం వేసినట్లుగా సమాచారం. స్పెషల్ ఆఫీసర్ అధికారికి తెలిసి జరిగిందా? లేక సిబ్బంది వికత చేష్టలా తెలియాల్సి ఉంది. ఒక దిక్కు మూఢ నమ్మకాలపై ప్రభుత్వం విస్తత ప్రచారం చేస్తుంటే.. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం పట్ల విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సీపీఐ(ఎం) నుంచి నాగారపు ఎల్లయ్య సస్పెండ్

నవతెలంగాణ-కామారెడ్డి



సీపీఐ(ఎం) నుంచి నాగారపు ఎల్లయ్యను సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు గత రెండు సంవత్సరాలుగా హాజరు కావడం లేదని, పార్టీ కార్యక్రమాలకు హాజరు కాకపోతే తగు చర్యలు తీసుకుంటామని పార్టీ నుండి తొలగిస్తామని రెండుసార్లు నోటీస్ ఇచ్చినట్టు తెలిపారు. ఇప్పటికీ నోటీసులకు ఎలాంటి సమాధానం కూడా ఇవ్వలేదని పేర్కన్నారు. అనారోగ్య కారణం వల్ల రాలేకపోయారనీ భావించి పార్టీ.. ఎల్లయ్యపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, కానీ తాజా ఇతర సంఘాలలో చేరి పార్టీకి ద్రోహం చేయడం సిగ్గుమాలిన చర్య అని, తక్షణమే ఎల్లయ్యను పార్టీ నుంచి, ఇతర ప్రజా సంఘాల నుంచి పూర్తిగా బహిష్కరిస్తున్నామని తెలిపారు. కావున పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాసంఘాల నాయకులు గమనించాలని సూచించారు.

నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ బదిలీ

- ఏడో బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని సైతం
- సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్లుగా నియామకం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనేవార్, ఏడో బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని కేంద్ర సర్వీసులకు డిప్యూటేషన్‌పై పంపుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2012 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కల్మేశ్వర్, రోహిణి ప్రియదర్శిని భార్యాభర్తలు కాగా కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లేందుకు అనుమతించాలని వారివురు దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీకి అసిస్టెంట్ డైరెక్టర్లుగా ఇద్దరిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిజామాబాద్ సీపీగా, బెటాలియన్ కమాండెంట్ గా ఇంకా ఎవరినీ నియమించలేదు.

ప్రాజెక్ట్ నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇవ్వాలి

- బైరాపూర్, మంచిప్ప గ్రామస్తుల డిమాండ్



ప్రాజెక్టు వద్ద సమావేశమై చర్చిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-మోపాల్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 21, 21 ఎ ప్యాకేజీలో గత ప్రభుత్వం రీడిజైన్ పేరుతో 3.5 టిఎంసి గా మార్చింది. అయితే రైతుల ఉద్యమంతో ఆ పనులు తాత్కాలికంగా నిలిపి వేశారు. అప్పుడు మద్దతు తెలిపిన డాక్టర్ భూపతి రెడ్డి ప్రాణహిత చేవెళ్ల లో భాగంగా 0.37 టిఎంసి పనులు మాత్రమే చేపట్టాలని మద్దతు తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మళ్ళీ ప్రాజెక్టు పనులు పున ప్రారంభించాలని సర్వే చేపట్టిందని, అయితే పాత డిజైన్ 0.37 టిఎంసి ప్రకారమే పనులు చేయాలని బైరాపూర్, మంచిప్ప గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దీనిపై రూరల్ ఎమ్మెల్యే రాబోవు రోజుల్లో మంచిప్ప గ్రామంలో రైతులతో మీటింగ్ ఏర్పాటు చేసి దీనిపై క్లారిటీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. గత ప్రభుత్వం లో 3.5 టిఎంసి నిల్వ కోసం కట్టిన భైరపూర్ గడ్కోల్ పంప్ హౌస్ 3.5 టిఎంసి కి మాత్రమే ఉపయోగంలో వస్తుంది. 0.37 కి ఏ మాత్రం ఈ పంప్ హౌస్ ఉపయోగ పడదు. కావున రైతుల భూములు పోకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలోనే బైరాపూర్ గ్రామపంచాయతీలో తీర్మానం చేసినట్టు చెబుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజా సమస్యలు పట్టట్లే

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు

నవతెలంగాణ-ఆర్మూర్



జెండా ఆవిష్కరిస్తున్న పల్లపు వెంకటేశ్..



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని, దేశంలో ప్రధాని మోడీ పాలన నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తుం దని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు విమర్శించారు. ఆర్మూర్ పట్టణంలో కమల నెహ్రూ కాలనీలో శుక్రవారం సీపీఐ(ఎం) ఆర్మూర్ ఏరియా 5వ మహాసభ నిర్వ హించారు. పార్టీ జెండాను పార్టీ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ ఆవిష్కరణ చేశారు. అమర వీరులకు నివాళులు అర్పించిన అనంతరం కూతాడి ఎల్లయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహిం చారు.

ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శితో పాటు, సీనియర్ నాయకులు పెద్ది వెంకట రాములు హాజరై మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం పేద ప్రజలకు అనేక హామీలు ఇచ్చి వాటిని విస్మరించి ందని అన్నారు. రైతులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి నరేంద్ర మోడీ మెడలు వంచారని అన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ పేద ప్రజలపై భారాలు వేస్తూ పెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలు వదిలేసి మతోన్మాదాన్ని ఉసిగొలుపుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో మతోన్మాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రజా పోరాటాలు నిర్వహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేయాలని అందరికి 2500 అమలు చేయాలని 500లకు గ్యాస్ సిలిండర్ అందరికీ రావడంలేదని ఆఫీసులో చుట్టూ తిరుగుతు న్నారని అన్నారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇవ్వాలని ఇల్లు వచ్చే వరకు పోరాటాన్ని కొనసా గించాలని అన్నారు.

ఇప్పటివరకు కట్టిన డబుల్ బెడ్ రూమ్‌లను వెంటనే అర్హులను గుర్తించి అందజేయా లని సూచించారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపుని చ్చారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం పాటలు పాడుతూ అలరించారు.

టీయూకు ఎట్టకేలకు వీసీ

- పూర్తిస్థాయి వీసీగా ప్రొ.టి.యాదగిరిరావు
- 5 నెలల ఇంచార్జి వీసీల పాలనకు ముగింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు రాష్ట్రంలోని 9 యూనివర్సిటీలకు పూర్తిస్థాయిలో వైస్ ఛాన్సలర్ల నియామకం చేపట్టింది. దీంతో తెలంగాణ యూనివర్సిటీకి పూర్తిస్థాయి వీసీగా ప్రొఫెసర్ టి. యాదగిరిరావు బాధ్యతలు చేపట్టనున్నారు. వీసీ నియామకానికి సెర్చ్ కమిటీ వేసిన ప్రభుత్వం ఎట్టకేలకు నియామకం చేపట్టడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ యూనివర్సిటీకి నూతన రెగ్యులర్ 5వ వీసీగా ప్రొఫెసర్ డాక్టర్ టి.యాదగిరి రావు నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం వరంగల్ జిల్లా కాకతీయ యూనివర్సిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. వరంగల్ జిల్లా వర్దన్నపేట మండలం నల్లవెల్లి గ్రామానికి చెందిన ఆయన.. కాకతీయ యూనివర్సి టీలో దూర విద్యాకేంద్రంలో తొలి ఉద్యోగి. 2004లో కాకతీయ యూని వర్సిటీలో అధ్యాపకుడిగా చేరారు. అనంతరం 2010లో ప్రొఫె సర్‌గా పదోన్నతి పొందారు. కేయూలో యూజీసీ కోఆర్డి నేటర్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతిగా, బీవోఎస్ చైర్మన్‌గా పలు అకడమిక్ పదవులు నిర్వహించారు. గతంలో తెలంగాణ యూనివర్సిటీ సోషల్ సైన్స్ డీన్‌గా రెండున్నరేళ్లపాటు పని చేశారు. సీనియర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు లోతైన పరిశోధన అనుభవమున్నది. ఇతని పర్యవేక్షణలో 15 మంది పీహెచ్‌డీ ఏడుగురికి ఎంఫిల్ పూర్తి చేశారు. 16 అంతర్జాతీయ స్థాయి సెమినార్లతో పాటు 27 జాతీయ స్థాయి సెమినార్లకు హాజరై పత్ర సమర్పణ చేశారు. 2021లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక అవార్డుతో గౌరవించింది. నేటికి అమెరికా స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, సింగాపూర్, ఇండోనేషియా దేశాలను సందర్శించినారు. టియులో సోషల్ సైన్స్ డీన్‌గా పని చేసిన అనుభవమున్నది. వీసీ పదవి కాలం మే-22 2024 నాటికీ ముగియ డంతో సీనియర్ ఐఏఎస్ అధికారి సందిప్‌కుమార్ సుల్తానియ ఇంచార్జీ వీసీగా కొన సాగుతున్నారు. 5 నెలల తరువత టీయూకి ప్రభుత్వం కొత్త వీసీని నియమించడం పట్ల అధ్యపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రొ. యాదగిరిరావు

గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్



ఉపాధ్యాయులకు దరఖాస్తు ఫామ్‌లు అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

వచ్చే సంవత్సరం 2025 మార్చ్‌లో జరగనున్న మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లాలోని ఉపాధ్యాయులు నవంబర్ 5 లోపు తమ ఓటరుగా నమోదు చేసుకోవాలని టీ.ఎస్. యూ.టి.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్ సూచించారు. ఏర్గట్ల మండలంలోని గుమ్మిర్యాల్ పాఠశాలలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయుల, ప్రజా సమస్యలను శాసన మండలిలో ప్రశ్నించే గొంతులను శాసన మండలికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు పోచారం
- ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు పట్టాల పంపిణీ



పట్టాలు అందజేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

పేద ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ సలహా దారులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బాన్సువాడ పట్టణంలో బీర్కూర్ మండలం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ రెండు పడకల గదుల ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో చేపట్టారు. రాష్ట్ర ఆగ్రోస్ సంస్థ చైర్మన్ కాసుల బాలరాజ్, బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి 40 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టా పత్రాలను పంపించేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గం లో ఇప్పటికి 11,000 డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. పేద ప్రజల అభివృద్ధి కోసం తాను ఎప్పుడు కృషి చేస్తూనే ఉంటానన్నారు. ఇల్లు లేని అర్హులందరికీ త్వరలోనే ఇందిరమ్మ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పేద ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ముందుకు తీసుకువస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ మరియు బీర్కూర్ తహసిల్దార్ లత, మాజీ ఎంపీపీ రఘు, దామరంచ శంకర్ శశికాంత్, రఘు, మన్నన్, కాలిక్, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పార్కింగ్ కోసం స్థల పరిశీలన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


స్థలంను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

శ్రద్ధానంద్ గంజిలో పార్కింగ్ స్థలంకోసం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం కూరగాయల మార్కెట్ వెనుకాల ఉన్న ఖాళీ స్థలంను పార్కింగ్ కోసం వినియోగించాలని ఆదేశించారు. ఈ స్థలంలో పార్కింగ్ కోసం వినియోగిస్తే కూరగాయల వ్యాపారులకు, మార్కెట్‌కు వచ్చిన ప్రజలకు వెహికల్స్ వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు, డైరెక్టర్లు మల్లేష్, బాగారెడ్డి పాల్గొన్నారు.

రూ.2లక్షల ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


ఎల్‌ఓసి అందజేస్తున్న ఎమ్మెల్యే

అనారోగ్యంతో బాధ పడుతున్న మహిళకు చికిత్స కోసం రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఎల్‌ఓసి మంజూరు చేయించి భరోసా కల్పించారు. వేల్పూర్ మండలం మోతె గ్రామానికి చెందిన యం.రమణి అనారోగ్యానికి గురై నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స కోసం చేరింది. ఈ విషయం స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి, మెరుగైన చికిత్సకోసం ప్రభుత్వం నుండి రూ.2లక్షల ఎల్‌ఓసిని మంజూరు చేయించారు. ఆ ఎల్‌ఓసి మంజూరు పత్రాన్ని శుక్రవారం బాధితురాలి కుటుంబ సభ్యులకు హైదరాబాద్ లో అందజేశారు. ప్రశాంత్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

ఐద్వా రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను నిజామాబాద్ ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని జిల్లా కార్యాలయంవద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, జిల్లా అధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తికై ఐద్వా నిరంతర పోరాటాలు చేస్తోందన్నారు. హింస లేని సమాజంకోసం పోరాడుతున్న ఐద్వా 4వ రాష్ట్ర మహాసభ భద్రాద్రి కొత్తగూడెంలో ఈనెల 21నుండి మూడురోజులపాటు జరగబోతున్నాయని తెలిపారు. మొదటిరోజు బహిరంగ సభ ఉంటుందని అన్నారు. జిల్లాలోని మహిళలు అధికసంఖ్యలో హాజరై మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వనజ, సంతోషి, శ్రావ్య, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్ల మరమ్మతులకు నిధులు మంజూరు


నిధుల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని పురాణిపేట్, దేవన్‌పల్లి గ్రామాల్లోని అంగన్వాడి సెంటర్లలో మైనర్ రిపేర్లకోసం ఒక్కో సెంటర్‌కు మండల పరిషత్ సాధారణ నిధులనుండి 50వేల చొప్పున నిధులు మంజూరు చేసినట్టు ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్ తెలిపారు. నిధులకు సంబంధించిన పత్రాలను శుక్రవారం సంబంధిత అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శారద, సీనియర్ అసిస్టెంట్ ప్రిన్స్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

మండలంలోని మెండోర గ్రామంలో సెర్ప్, ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్, శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి ధాన్యాన్ని అమ్ముకోవద్దని అన్నారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లు, దొడ్డు వడ్లు కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తప్ప, తాలు లేకుండా తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రవీందర్, సీసీ శ్రీనివాస్, నరేష్, రఘుపతి మహిళా సంఘ అధ్యక్షులు లక్ష్మి, వీఓఏ శిరీష, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సీఎంను సన్మానించిన కేశవేణు

నవతెలంగాణ-కంఠేశ్వర్


సీఎంను కలిసిన్న కేశవేణు, ఎమ్మెల్యే, మానాల

నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన కేశ వేణు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మలేరియా యూనిట్ అధికారి ఎస్. గోవర్దన్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిక్లి గ్రామంలోగల ప్రాథమిక పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మలేరియా యూనిట్ అధికారి ఎస్. గోవర్ధన్ పాల్గొని మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, నీటి ద్వారా వచ్చే వ్యాధులను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల నివారణ కోసం కాచివడబోసిన నీటినే తాగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం గ్రామంలో డెంగ్యూ వ్యాధిగ్రస్తుని ఇల్లు సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. గ్రామంలో డ్రైనేజి వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో డెంగ్యూ వ్యాధి వచ్చిందని తెలిపారు. గ్రామంలో నీటి నిల్వలు, దోమ లార్వా ఉన్న చోట మందును చల్లించి, ఇండ్లలో స్ప్రే చేయించాలని గ్రామ పంచాయతీ సెక్రెటరీకి సూచించారు. ఇందులో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేష్, వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అండర్-17 వాలీబాల్ జోనల్ స్థాయి ఎంపిక పోటీలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



కమ్మర్‌పల్లి: జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం అండర్-17 బాల బాలికల వాలీబాల్ కమ్మర్‌పల్లి జోనల్ స్థాయి ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ఇంచార్జి పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ఫిజికల్ డైరెక్టర్ వేముల నాగభూషణం, రాజేశ్వర్ గౌడ్, శ్యామ్, మాధురి, సింధు, బాలు, అజయ్, రాజు, తదితరలు పాల్గొని టీమ్స్ సెలెక్షన్ నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ గ్రౌండ్‌లో జరిగే జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఎంఈఓ ఆంధ్రయ్య తెలిపారు.

వాలీబాల్ జోనల్ స్థాయికి ఎం పికైన విద్యార్థులు వీరే...

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన అండర్-17 వాలీబాల్ జోనల్ స్థాయికి ఎంపికైన విద్యా ర్థుల వివరాలను ఫిజికల్ డైరెక్టర్ నాగభూషణం వెల్లడించారు. బాలుర విభాగంలో శ్రీ విద్యాసాయి ఉన్నత పాఠశాలకు చెందిన అభినవ్, శ్రీమాన్, రాకేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన రాజ్ కుమార్, విజ్ఞాన జ్యోతి ఉన్నత పాఠశాలకు చెందిన వికాస్, రిషివర్ధన్, సచిన్, మోర్తాడ్ మహాత్మ జ్యోతిబాపూలే ఉన్నత పాఠశాలకు చెందిన సాగర్, విఘ్నేష్, విక్కీ, హాస కొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిధిత్, తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సాయినాథ్, అదనపు ప్లేయర్స్ గా ధర్మోరా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దీక్షిత్, మిసిమి ఉన్నత పాఠశాలకు చెందిన రవి చరణ్, విజ్ఞాన జ్యోతి ఉన్నత పాఠశాలకు చెందిన బాల నితీష్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమ్మర్‌పల్లికి చెందిన వైష్ణవి, శరణ్య, శిరీష, నందిని, సుప్రియ, శ్రీజ, మిసిమి ఉన్నత పాఠశాలకు చెందిన జయశ్రీ, శాలిని, పౌలస్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధర్మోరా చెందిన లహిత, రాణి,మోహిత, అదనపు ప్లేయర్స్ గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమ్మర్ పల్లికి చెందిన గీతిక, శ్రీ భాగ్య, రచిత, వర్ధిని, గంగాదేవి ఎంపికయ్యారు. జూన్ స్థాయికి ఎంపికైన విద్యార్థిని విద్యార్థులను మండల విద్యాధికారి ఆంధ్రయ్య అభినందించారు.

ఓటమి గెలుపునకు నాంది పలకాలి

- 68వ ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి


జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపికైన విద్యార్థులు

ప్రతి క్రీడాపోటీలో ఓటమి గెలుపుకు నాంది పలకాలని ఆటలో మంచి ప్రతిభను కనబరిచిన జట్టే గెలుపు పొందుతుందని, ఓడిన వారు నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా ముందు మంచి ఆట తీరును ప్రదర్శించి గెలిపియంగా బరిలోకి దిగాలని తహసిల్దార్ వెంకట్ రావు, ఎంపీడీవో లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నాపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68వ ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను తహసీల్దార్ వెంకట్ రావు, ఎంపిడిఓ లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి టోర్నమెంట్లో జట్టులో ఉన్న సభ్యుల ఆట తీరుపైనే గెలుపోటములు ఆధారపడి ఉంటాయని, గెలిచిన ఓడిన ఆట తీరును మెరుగు పరుచుకుంటూ ఉండాలని సూచించారు. అంతకుముందు జిల్లాలోని క్రీడాకారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించి క్రీడలను ప్రారంభించారు. 14 ఏళ్ల నుండి 15 ఏళ్ల లోపు బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిఓ రాజ్‌కాంత్ రావు, మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్, పిఈటిలు, వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, క్రీడాకారులు, విద్యార్థులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ పాఠశాల విద్యార్థినులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

ఈ నెల 18 నుండి 20వరకు వరంగల్ జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర జూనియర్ 9వ సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు గెడం వనజ, గెడం సరిత ఎంపికై శుక్రవారం ఉదయం బయలుదేరినట్టు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సబ్-జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన పాఠశాల క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి, గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్ రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో పాఠశాల క్రీడాకారులు రాణించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ, గంగాధర్, డాక్టర్ నరసింహరావ్, సునీత, కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ గంగాధర్ పాల్గొన్నారు.

దోమ లార్వాను నాశనం చేయడానికి
డెమో ఫాస్, పైరిత్రిన్ స్ప్రే చేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి


దోమల మందులు స్ప్రే చేయిస్తున్న అధికారులు

దోమ లార్వాను నాశనం చేయడానికి డెమో ఫాస్, పైరిత్రిన్ స్ప్రే చేసే విధంగా చూడాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ అన్నారు. శుక్రవారం ఇందల్‌వాయి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని సంస్థాన్ సిర్నాపల్లి, నల్లవెల్లి గ్రామాల్లో జాతీయ కీటక జనిత వ్యాధుల నిరోధక కార్యక్రమంలో భాగంగా డెంగ్యూ కేసుల తగ్గించుటకు దోమలు, దోమ లార్వాను నాశనం చేయడానికి డెమోఫాస్, పైరిత్రిన్ స్ప్రే చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిలువగల ప్రదేశాలను గుర్తించి గ్రామ కార్యదర్శికి నివేదించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో ఎవరైనా జ్వరంతో బాధపడినట్లయితే తొందరగా గ్రామ ఆరోగ్య సిబ్బందిని కలిసి తగిన మాత్రలు వేసుకోవాలని సూచించారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులతో, గ్రామ మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పరచుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. డెంగ్యూ కేసు నమోదైన గ్రామంలో కచ్చితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. దోమల లార్వా నివారణకు నీటి నిల్వ పూర్తిగా తొలగించాలని, నీటి నిల్వగల ప్రాంతాల్లో గంబుషియా చేపలు, ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. దోమలను నిర్మూలించడానికి స్ప్రే చేయించాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సంతోషి, విజయ, ఎంఎల్‌హెచ్‌పి కావ్య, దీపిక, సంధ్య పాల్గొన్నారు.

స్నేహ సొసైటీ విద్యార్థులకు అన్నదానం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్నేహ సొసైటి విద్యార్థులకు ఒక్క రోజు అన్నదానం కార్యక్రమాన్ని ధర్పల్లి మండలం వాడి గ్రామానికి చెందిన పటెండ్ల (కర్క) రాములు- బోజమ్మ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారని స్నేహ సొసైటీ వ్యవస్థాపకులు సిద్దయ్య, స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి లు అన్నారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని మారుతి నగర్‌లోగల స్నేహ సొసైటీలో భోజనం ఏర్పాటుచేసిన పటెండ్ల, కర్క రాములు- బోజమ్మ కుటుంబ సభ్యులు విద్యార్థులతో కలసి సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి మాట్లాడుతూ.. గల్ఫ్‌లో ఉద్యోగం చేస్తూ ఇండియాకు వచ్చిన సందర్భంగా విద్యార్థుల కోసం భోజనం అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు అవసరం అయ్యే నోట్ పుస్తకాలు, పెన్నులు ఇతర సామగ్రి అందజేయవచ్చని అన్నారు. ఈ సందర్భంగా రాములు- బోజమ్మ మాట్లాడుతూ.. పెద్ద కుమారుడు రమేష్ కోరిక మేరకు విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. తమ వంతుగా విద్యార్థులకు భోజనం అందజేయడం సంతోషంగా ఉందని, స్నేహ సొసైటీ కి మా సహాయ సహకారాలు ఎల్లపుడు ఉంటాయని అన్నారు. అందరూ బర్త్ డే, పెళ్లి రోజు వేడుకలు ఇక్కడే జరుపుకుని విద్యార్థులకు బోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పేటెండ్ల లక్ష్మి, రమేష్, శివ, నితిన్, నరేష్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణా టీకాలు


నవీపేట్: పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి


జక్రాన్‌పల్లిలో..


ముప్కాల్‌లో...

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని మోకన్‌పల్లి గ్రామంలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను మండల పశు వైద్యాధికారి నరేందర్ శుక్రవారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 646 పశువులకు గాలికుంటు టీకాలు వేశామని, ప్రతి పాడి రైతు తమ పశువులకు గాలికుంటు టీకాలను వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో 47 ఆవులు, 348 గేదెలు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గోపాల మిత్రులు, విడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ముప్కాల్: పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దాదాపు 120 పశువులకు (ఆవులు, గేదెలు)కు ఉచిత గాలికుంట నివారణ టీకాలు వేసినట్టు పశువైద్య అధికారి గౌతమ్ రాజు తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది ప్రణీత్, మల్లేష్, బషీర్ పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు

నవతెలంగాణ- నవీపేట్


వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ చైర్మన్

బినోల సొసైటీ పరిధిలోని గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు తహసిల్దార్ వెంకటరమణకు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా ఇప్పటికి సహకార సంఘాలకు అనుమతులు, నిబంధనలో రాకపోవడంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేకపోతున్నామని అన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్ అందించి రైతులకు లాభం చేకూర్చాలని అన్నారు.

మంచినీటి సహాయకులకు సర్టిఫికెట్లు అందజేత


సర్టిఫికేట్‌లు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామ శివారులో గల మిషన్ భగీరథ కార్యాలయంలో ఆర్మూర్ మండలంలోని అన్ని గ్రామాల మంచినీటి సహాయకులకు మిషన్ భగీరథ గ్రిడ్ డిఈ శివకృష్ణ, మిషన్ భగీరథ ఆర్మూర్ డీఈ గంగారాం శిక్షణ పొందిన సర్టిఫికెట్లను శుక్రవారం అందజేశారు. మిషన్ భగీరథ కార్యాలయంలో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీటి వాడకం, పరికరాల రిపేరుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈ ఈ నరేష్, ఏఈఈ నరేందర్, మోహన్ రెడ్డి, లైన్ మెన్లు రోడ్డ సాయన్న మధు మారుతి రంజిత్ రాజు ఆర్మూర్ మండలంలోని అన్ని గ్రామాల మంచినీటి సహాయకులు తదితరులు పాల్గొన్నారు

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృష్టమైనట్లు రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ యాసిర్ అరాఫత్ శుక్రవారం తెలిపారు. నగరంలోని దారు గల్లికి చెందిన షేక్ మెహబూబ్(35) మతిస్థిమితం లేక ఈ నెల 16న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యక్తి ఎక్కడైనా కనిపిస్తే రెండవ పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

పార్లమెంట్ లైబ్రరీకి పుస్తకం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్



'అమెరికన్ రచయిత రాండీ యంగ్ రచించిన 'ది స్కెచ్ ఆర్టిస్ట్' అనే పుస్తకాన్ని పార్లమెంటు సభ్యులు కె.ఆర్.సురేష్ రెడ్డి శుక్రవారం పార్లమెంట్ లైబ్రరీకి అందించారు. పార్లమెంట్ లైబ్రరీలో చదవడానికి, తన జ్ఞానాన్ని విస్తరించడానికి సమయాన్ని వెచ్చించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ నిల్వ సీజ్

నవతెలంగాణ-ఏర్గట్ల



మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన రెండు ట్రాక్టర్ల ఇసుకను శుక్రవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ శ్రీలత తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డోంగ్లి ఏవోగా శివ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండల వ్యవసాయాధికారిగా శివ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. డోంగ్లి మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయానికి వచ్చిన కొత్త ఏవో శివకు పలువురు నాయకులు, అధికారులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో డోంగ్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ అశోక్ పటేల్, సింగిల్ విండో ఉన్నతాధికారి తదితరులు పాల్గొన్నారు.



ఏవో శివను సన్మానిస్తున్న పలువురు

రోడ్డు పక్కన కంపు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావుపేట్ గ్రామంలోనికి వెళ్లే దారిలో కంపుకొడుతోంది. చెత్త చెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించాల్సింది పోయి.. గ్రామ సమీపంలోనే చెత్త వేయడంతో రోడ్డు వెంబడి వెళ్లే ప్రజలకు కంపుకొడుతుంది. తద్వారా దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటిని పట్టించుకోకుండా పోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న చెత్తచెదారాన్ని తొలగించాలని కోరుతున్నారు.



పేరుకుపోయిన చెత్తచెదారాం

చిన్నారుల ప్రాణాలను కాపాడుదాం

- రక్తదానానికి యువకులు ముందుకు రావాలి
- కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందూప్రియ

నవతెలంగాణ-కామారెడ్డి

రక్తదానం చేసి చిన్నారుల ప్రాణాలను కాపాడుదామని, రక్తదానానికి యువకులు ముందుకురావాలని కామారెడ్డి చైర్‌పర్సన్ గడ్డం ఇందూప్రియ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో రక్తదానానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడాలనే ఉద్దేశంతో కామారెడ్డి రక్తదాతల సమూహం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్), ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో ఈ ఆదివారం జిల్లా కేంద్రంలోని కర్షక్ బి.ఎడ్ కళాశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న రక్తదాతలు వచ్చి రక్తదానం చేయాలని, రక్తం సకాలంలో దొరకకపోవడంతో చిన్నారులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని వారికి కావలసిన రక్తాన్ని అందజేయాల్సిన బాధ్యత సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరిపైన ఉందని తెలిపారు. 15 రోజులకు ఒక యూనిట్ రక్తం తలసేమియా చిన్నారులకు జీవితాంతం అవసరం ఉంటుందన్నారు. రక్తదానం చేసిన రక్తదాతలను అభినందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్‌లు రానున్నట్టు తెలిపారు. రక్తదానం చేయాలనుకునే వారు మరిన్ని వివరాల కోసం 9492874006 నెంబర్‌కు సంప్రదించాలని అన్నారు. ఈ సమావేశంలో ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, కౌన్సిలర్ పాత శివ కృష్ణమూర్తి, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్, ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్, ఉపాధ్యక్షులు జమీల్ హైమద్, డాక్టర్ పుట్ల అనిల్ కుమార్, సలహాదారులు ఎర్రం చంద్రశేఖర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందూప్రియ

ప్రాథమిక పాఠశాల సందర్శన..

కామారెడ్డి పట్టణంలోని వడ్డెర కాలనీ 42వ వార్డులో ప్రాథమిక పాఠశాలను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం అకస్మాత్తుగా తనిఖీ చేశారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ... స్కూల్ చుట్టు పక్కల ఉన్న పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. అలాగే స్కూల్లో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం పెట్టాలని పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటం లేకపోవడంతో వెంటనే మున్సిపల్ చైర్మన్ తెప్పించి ఏర్పాటు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోటో పాఠశాల ఆవరణంలో లేకపోవడంపై ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, ఎంఈఓ ఎల్లయ్య, కౌన్సిలర్లు చాట్ల వంశీకృష్ణ, పాత శివ కృష్ణమూర్తి, శానిటైజర్ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-పొతంగల్

మండల కేంద్రంలో ఇండియన్ బ్యాంక్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. 1907లో స్థాపించిన పురాతనమైన బ్యాంక్, చాలా కాలంగా ప్రజలకు సేవచేస్తున్నదని తెలిపారు. అనంతరం కరీంనగర్ జోనల్ మేనేజర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ.. మంచి సేవలకు తమ బ్యాంక్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ అరవింద్ మాట్లాడుతూ.. ప్రారంభోత్సవానికి విచ్చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలో వరి కోతలు ప్రారంభమై పక్షం రోజు గడుస్తున్నా ప్రభుత్వం ఇంతవరకూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎడపల్లి బీజేపీ మండల నాయకులు అన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ అనూషకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కందగట్ల రామచందర్, మల్లెపూల శ్రీనివాస్, కంటేడి గంగాధర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సహకారం సంఘ చైర్మన్

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండల కేంద్రంలోని సహకారం సంఘ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా మాట్లాడుతూ ప్రభుత్వం అనుకూల సమయానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, వైస్ చైర్మన్ లక్ష్మణ్, డైరెక్టర్‌లు, సుధాకర్‌రావు, హైమద్, ఎంపీడీఓ నీలావతి, తహసీల్దార్ టీ శాంత, ఏఓ రవీందర్, ఏఈఓ కృష్ణరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ తారాసింగ్, సొసైటీ డైరెక్టర్‌లు కల్లూరి రాంరెడ్డి, రాథోడ్ భజన్‌లాల్, మేడిపల్లి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేయాలి

- కమిటీ సభ్యులకు సమాచారం లేకుండా రిజిస్ట్రేషన్
- ఆగ్రహం వ్యక్తం చేసిన నూతన కమిటీ అధ్యక్షులు, సభ్యులు
- సమావేశానికి గైర్హాజరైన నలుగురు సభ్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

సీతారామాంజనేయ గుడి స్థలాన్ని ట్రస్ట్‌కు రిజిస్ట్రేషన్ చేయడం సరైన పద్ధతి కాదని రిజిస్ట్రేషన్ వెంటనే రద్దు చేయాలని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సభ్యులు అన్నారు. ఈ విషయంపై శుక్రవారం సీతారామాంజనేయ ఆలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వివేకానంద కాలనీలో గల శ్రీ సీతారామాంజనేయ ఆలయానికి సంబంధించిన స్థలాన్ని ట్రస్టుకు ఐదుగురు మాత్రమే కలిసి ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని, నూతన ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సభ్యులు పూర్వాధ్యక్షులపై అతనితో పాటు ఆ నలుగురిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ నూతన కమిటీ సభ్యులతోపాటు భక్తులు శుక్రవారం ఆలయ కమిటీలో సమావేశం ఏర్పాటు చేసి వారిని ఈ సమావేశానికి ఆహ్వానించగా వారు హాజరుకాకపోవడంపై పలు అనుమానాలను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీతారామాంజనేయ దేవస్థానం న్యాయ సలహాదారులు లాయర్ సీతారాములు, లాయర్ నాగభూషం మాట్లాడుతూ సర్వే నెంబర్ లేకుండా రిజిస్ట్రేషన్ అధికారి రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని, కమిటీ సభ్యులను భక్తులను సంప్రదించకుండా ట్రస్ట్ ఏర్పాటు చేయవలసిన అవసరం ఏమొచ్చిందని, ట్రస్ట్ ఏర్పాటు చేయడంతో పాటు గుడికి సంబంధించిన స్థలాన్ని ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఆలయ ముఖ్య సలహాదారులు అలిమీ శెట్టి లక్ష్మరాజం, ఆలయ కమిటీ అధ్యక్షులు కొండ అశోక్ గుప్త, కార్యదర్శి నాగేల్లి శ్రీనివాస్‌గుప్తా, కోశాధికారి తమ్మి శ్రీనివాస్ గుప్తా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న నూతన కమిటీ సభ్యులు

పోచారంను కలిసిన టీఎన్జీఓస్ నేతలు



పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన టీఎన్జీఓస్ నేతలు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్‌ను పోచారం స్వగృహంలో టీఎన్జీఓస్ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి, కోశాధికారి ఎం.దేవరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్, కామారెడ్డి అర్బన్ తాలూకా కార్యదర్శి శివకుమార్, బాన్సువాడ తాలూకా అధ్యక్షులు తుల శీను, కార్యదర్శి అజీముద్దీన్, కోశాధికారి అబ్దుల్ రజాక్, ఉపాధ్యక్షులు రవి, సుభాష్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జా భూమిని రికవరీ చేసుకోవాలి

- వ్యక్తి అర్ధనగ్న నిరసన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని పోచారం ప్రధాన కాలువకు ఆనుకుని ఉన్న ఇరిగేషన్‌కు సంబంధించిన భూమిని గ్రామానికి చెందిన కిషన్‌రెడ్డి కబ్జా చేస్తున్నారని అదే గ్రామానికి చెందిన జగన్‌రెడ్డి శుక్రవారం ఇరిగేషన్ కార్యాలయం ముందు అర్ధనగ్న నిరసన తెలిపాడు. వివరాలిలా ఉన్నాయి.. పోచారం గ్రామానికి చెందిన కిషన్‌రెడ్డి డి2లో 30 గుంటల భూమిని కబ్జా చేసి సాగుచేస్తున్నారని గతంలో 2018 సంవత్సరంలో ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో కిషన్ రెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఇరిగేషన్‌కు సంబంధించిన భూమిని తిరిగి ఇరిగేషన్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదే భూమిని తిరిగి కిషన్ రెడ్డి మళ్లీ కబ్జా చేస్తున్నారని ఈనెల 7వ తేదీన కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో గ్రామానికి చెందిన జగన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈనెల 7న ఫిర్యాదు చేసిన ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడంతో శుక్రవారం మండల కేంద్రంలో గల ఇరిగేషన్ కార్యాలయం ఎదురుగా అర్ధ నగ్నంగా నిరసన వ్యక్తం చేశాడు. కబ్జా చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి ఇరిగేషన్‌కు సంబంధించిన 30 గుంటల స్థలాన్ని రికవరీ చేసుకోవాలని ఆయన పేర్కొన్నాడు.



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న వ్యక్తి

స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం

పోచారం గ్రామంలో పోచారం ప్రధాన కాలువ ఆనుకొని 30 గుంటల స్థలాన్ని గ్రామానికి చెందిన కిషన్ రెడ్డి కబ్జా చేసిన విషయం వాస్తవమే. గతంలో అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి స్థలాన్ని ఇరిగేషన్ శాఖ స్వాధీనం చేసుకుంది. తిరిగి అతను కబ్జా చేశాడని ఫిర్యాదు మాకు అందింది. అతనిపై కేసు నమోదు చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం.

- ఇరిగేషన్ డిఈఈ వెంకటేశ్వర్లు

నవోదయలో ఖాళీ సీట్ల భర్తీకి ఆహ్వానం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని జవహర్‌లాల్ నవోదయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతిలో ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యవతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం ఉమ్మడి జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 01-05-2010 నుంచి 31-07-2012 తేదీల మధ్యలో జన్మించి ఉండవలెనని పేర్కొన్నారు. అలాగే 10వ తరగతి చదువుతున్న ఉమ్మడి నిజామాబాద్ విద్యార్థులు 01-06-2008 నుంచి 31-07-2010 తేదీల మధ్యలో జన్మించి ఉండాలని సూచించారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 30వ తేదీ వరకు ఆన్లైన్లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష 8 ఫిబ్రవరి 2025న నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. https://navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఐకేపీ ఆధ్వర్యంలో నాటుకోళ్ల యూనిట్ ప్రారంభం



నాటుకోళ్ల యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఐకేపీ ఏపీఎం గంగారాం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని మినార్‌పల్లి గ్రామంలో శుక్రవారం ఇందిరా క్రాంతి పథంలో భాగంగా శాంతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో నాటుకోళ్ల ఫారం యూనిట్‌ను ఐకేపీ ఏపీఎం గంగారాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు నాటు పెరటి కోళ్ల పెంపకం ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. న్యూ ఎంటర్ ప్రైజెస్ కార్యక్రమంలో భాగంగా మినార్ పల్లిలో అంజలి ఈ యూనిట్ ఏర్పాటు చేసుకున్నట్టు తెలిపారు. అంజలి తన జీవన ఆధారం కోసం రూ.3,00,000 తో కోళ్ల ఫారం ఏర్పాటు చేశారన్నారు. స్త్రీనిధి అందించే ఆర్థిక సహాయంతో ఈ యూనిట్ ఏర్పాటు చేశారని తెలిపారు. మినార్‌పల్లిలో పాడిపశువులు, న్యూ ఎంటర్‌ప్రైజెస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకు, స్త్రీనిధి ద్వారా ఋణాలు అందించి మహిళలకు ఉపాధి కల్పించనున్నట్టు పేర్కొన్నారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు లక్ష్మి, మాజీ సర్పంచి ఫంగిబాయి, పెద్దలు తారాచంద్, వెంకటసాయి, గ్రూపు సభ్యులు విఓ గోదావరి, క్లస్టర్ సీసీ సాయికుమార్, పోశెట్టి, బాలరాజు, సునీత తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



సహాయనిధి చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు గ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద చెక్కులను అందజేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్ధారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వంజరి ఎల్లమయ్య తదితరులు పాల్గొన్నారు.

బిసి మహిళా అయినందుకే
కొండా సురేఖపై ముప్పేట దాడి

- బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నల్లా సూర్యప్రకాష్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బిసి మహిళా అయినందుకే బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వంలోని అగ్రకులాలు ముప్పేట దాడి చేస్తున్నారని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నల్లా సూర్యప్రకాష్ విమర్శించారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన బహుజన లెఫ్ట్ పార్టీ - బిఎల్‌పి, రాష్ట్ర కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ, సినిమా రంగంలోని ఆధిపత్య కులాలు ఉద్దేశపూర్వకంగానే ఒక బిసి మహిళా మంత్రి కొండా సురేఖపై రాజకీయ దాడి చేస్తున్నారని ఆయన విమర్శించారు. బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ మాట్లాడుతూ.. రాష్ట్రం ప్రధాన రాజకీయ పార్టీలు బీఆర్ఎస్, బిజెపి, ఎంఐఎంలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి హైడ్రా, మూసి చూట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కుల జనగణన జరిపి చట్టసభల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం వాటా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధిరాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రెండు లక్షల మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆలోపు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వడ్ల సాయి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో గురుకులాలకు స్వంత భవనాలను నిర్మించాలని, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమ హాస్టళ్లను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మారోజు సునీల్ కుమార్, కమిటీ సభ్యులు, వడ్ల సాయికృష్ణ, యస్‌డి సయ్యద్, వి.యాదగిరి, నాగరపు యెల్లయ్య, గంగామణి పాల్గొన్నారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-మద్నూర్

మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ - ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులు ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని తహసిల్దార్ ఎండి ముజీబ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నియోజకవర్గాలకు సంబంధించి ఇప్పటికే ఉన్న సాధారణ ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న వ్యక్తులందరూ కూడా నిర్దిష్ట ఫారమ్‌లో తాజా దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ అందజేత

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల జెడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మాజీ సర్పంచ్ విట్టల్ రెడ్డి స్పోర్ట్స్ యూనిఫాంను అందజేశారు. 30 మంది విద్యార్థులకు గాను ఒకే రకమైన యూనిఫామ్‌లు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంట కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇమామ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫారుక్ సాబ్, సుధాకర్, గులాం హుస్సేన్, శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, క్రీడా ఉపాధ్యాయులు సబ్బాత్ కృష్ణ ఉన్నారు.

కందకుర్తిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను శుక్రవారం పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ విట్టల్ పేర్కొన్నారు. జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా కందకుర్తి గ్రామంలో తెల్లజాతి పశువులు 184, నల్లజాతి పశువులు 267 గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నీలా సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారులు గంగరాజు, నాగరత్న, సిబ్బంది నవీన్, సావిత్రి, లక్ష్మణ్, గోపాల్ మిత్ర యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

సోయా కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మార్కెట్ కమిటీ కార్యదర్శి

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ డోంగ్లి ఇరు మండలాలకు చెందిన సోయా కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ కార్యదర్శి రామ్నాథ్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. తూకం జరిగిన సోయా పంట ఎప్పటికప్పుడు ఖాళీ కావడానికి లారీలను చెప్పించే విధంగా సింగిల్ విండో కార్యదర్శి బాబురావు చొరవ చూపాలని తెలిపారు. ఎలాంటి మోసాలు జరగకుండా హమాలీలకు పలు సూచనలు చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
నిజామాబాద్
శనివారం | అక్టోబర్ 19, 2024 | www.navatelangana.com

ప్రీ రిపబ్లిక్ దినోత్సవానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వెస్ట్ జోన్ ముందస్తు రిపబ్లిక్ దినోత్సవం తెలంగాణ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి హాజరై వాలంటీర్లు క్రమశిక్షణతో దేశభక్తి కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన వాలంటీర్లు జాతీయ సమైక్యత లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ హాజరై ఎంపిక నిబంధనల ప్రకారం ఎత్తు, బరువు పరిశీలించి, పరేడ్ చేయించి ఎంపిక చేశారు. అనంతరం వాలంటీర్ల విషయ పరిజ్ఞానంతో పాటు, గానం, నృత్యం భాషా నైపుణ్యాల ఆధారంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ స్వప్న, డాక్టర్ ప్రవంతి, 12 కళాశాలల వాలంటీర్లు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

- 4 లక్షలు 5 తులాల బంగారం అపహరణ
- అర్గుల్ గ్రామంలో ఘటన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ ఇంట్లోనుండి 4 లక్షల రూపాయలు, 5 తులాల బంగారం ఎత్తుకెళ్లినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు. అర్గుల్ గ్రామంలోని వీధి నెంబర్-8లో గల మగ్గిడి గంగాధర్ రోజువారి పని నిమిత్తం ఆర్మూర్‌కు వెళ్లారు. ఈ సమయంలో ఇంట్లో ఉన్న తన భార్య మధ్యాహ్నం రెండు గంటలకు పక్కనగల ఇంట్లోకి వెళ్లి తిరిగి మధ్యాహ్నం మూడు గంటలకి వచ్చింది. ఇంటి మెయిన్ డోర్ కొద్దిగా తెరిచి ఉంది. లోపలి వెళ్లి చూస్తే సరికి బెడ్ రూమ్‌లోని అల్మారాలో ఉన్న దాదాపు 4 లక్షల రూపాయలు, ఒక బంగారు నెక్లెస్, బంగారు తీగ దాదాపు 5 తులాలు కనిపించలేదు. చుట్టుపక్కల వారిని అడిగితే ఒక గుర్తు తెలియని వ్యక్తి వారి ఇంటి నుంచి బయటకు వెళ్లినట్టు తెలిసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఘటన స్థలానికి డిచ్‌పల్లి సీఐ డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం లతో దర్యాప్తు చేపట్టారు.

పెండింగ్ డీఏలు ప్రకటించాలి

టీఎస్ యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-ముపాల్

పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల డీఏలను తక్షణమే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సత్యానంద్, ఓ.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 నుంచి ఇప్పటి వరకు రావాల్సిన 5 డీఏలలో తక్షణమే నాలుగు డీఏలను ఈ నెల 23న నిర్వహించే కేబినెట్ సమావేశంలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు ప్రస్తుతం కష్టాల్లో ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఎంతైనా ఉందన్నారు.

గ్రామ మంచినీటి సహాయకులకు ట్రైనింగ్ పూర్తి



సర్టిఫికెట్లు అందుకున్న గ్రామ మంచినీటి సహాయకులు

నవతెలంగాణ-మోపాల్

మిషన్ భగీరథశాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్, మోపాల్ మండలాలకు చెందిన గ్రామ మంచినీటి సహాయకుల కు ఈనెల 15 నుండి 18 వరకు మోపాల్ మండల రైతు వేదికలో శిక్షణ ఇచ్చారు. నీటిని ఏ విధంగా అందించాలి. పైప్‌లైన్, లీకేజీలు, ఎలక్ట్రికల్ సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్, పంపు సెట్ రిపేర్లు, హ్యాండ్ పంపుల రిపేర్లు ఇలా నాలుగు అంశాల పైన అవగాహనతోపాటు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమం ముగింపు సందర్భంగా మిషన్ భగీరథ ఎస్ఈ కే.రాజేంద్ర కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, మోపాల్ ఎంపీడీవో రాములు నాయక్, డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీధర్, నిజామాబాద్ ఏఈ శివ తేజ, మోపాల్ ఏఈ వినయ్ రెడ్డి, శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మాక్లూర్ కేజీబీవీ ఎస్ఓపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ టీపీటీఎఫ్ తరగతి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఏవోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్ల సత్యనారాయణ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ మాక్లూర్ కేజీబీవీ ఎస్ఓపై వరుసగా వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారన్నారు. మాక్లూర్ కేజీబీవీకి విచారణకు వెళ్లిన మండల అధికారులు బాధితులతో మాట్లాడకుండా ఎస్ఓతో ఆమె ఎంపిక చేసిన ఇద్దరి టీచర్లతో మాట్లాడి వచ్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ జరిగిందన్న విషయం విచారణ అధికారులు వెళ్లే వరకు బాధితులకు తెలియకపోవడం శోచనీయమన్నారు. రెండు నెలలుగా విద్యాశాఖ పైఅధికారులను బాధితులు కలుస్తూ, టీచర్లు, సిబ్బందిపై అనేక వేధింపులకు పాల్పడుతున్న ఎస్ఓపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్నారు. తక్షణమే కలెక్టర్ చొరవ తీసుకొని తన పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

మాక్లూర్ కేజీబీవీ ఎస్ఓపై చర్యలు తీసుకోవాలి

మాక్లూర్ కేజీబీవీ ఎస్ఓ పై చర్యలు తీసుకోవాలి అని పిడి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్ డాక్టర్ కర్క గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మాక్లూర్ కేజీబీవీలో సీఆర్‌టీ గౌతమి అనే టీచర్ క్లైన్ పోవడం వల్ల విద్యార్థులందరిని భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. గొలుసు కోసం సహస్ర అనే ఆరో తరగతి విద్యార్థినిని నందిపేట్ మండలంలోని మారంపల్లికి ఒక మంత్రగాని వద్ద తీసుకుపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా విద్యార్థినిని బయటకు తీసుకుపోవడంతోపాటు విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేశారని, దీనికి సహకరించిన ఎస్ఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విలీన మహాసభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

ఈ నెల 20న హైదరాబాదులో జరిగే విలీన మహాసభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం. ముత్తన్న అన్నారు. పట్టణంలోని దేశాయి బీడీకంపెనీలో వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం పది సంవత్సరాలుగా కార్మిక వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తున్నారని అన్నారు. కార్మికుల జీవితాలను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్నారని తెలిపారు. ఇప్పటికే 14 రాష్ట్రాల్లో కార్మిక వర్గాల పోరాడుతున్న టీయూసీలతో ఐఎఫ్‌టీయూను విలీనం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఈనెల 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు జిల్లాలో వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఎండి నజీర్, మనోజ్ తూర్పాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్ప్రే మిషన్ల పంపిణీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని కీటక జనిత వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ చేతుల మీదుగా పవర్ స్ప్రే మిషన్స్ ను జిల్లా కేంద్రంలోని పీఓడీటీటి వద్ద 11 మంది సబ్ యూనిట్ అధికారులకు అందించారు. ఈ స్ప్రే మిషన్లు సుమారు ఒక్కొటి నాలుగు వేల రూపాయల విలువ చేసేవని అన్నారు. జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులందరూ కేసు వచ్చిన ఇంటి చుట్టు పరిసరాల్లో యాంటీ లార్వల్ స్ప్రేను, ఇంటిలో ఐఆర్ఎస్ స్ప్రేను, డ్రై డేస్‌ను వారానికి రెండుసార్లు విస్తృతంగా నిర్వహించి జిల్లాలో కీటక జనిత వ్యాధులను ముఖ్యంగా డెంగ్యూ నియంత్రించాలని సూచించారు. కార్యక్రమంలో కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, నిజామాబాద్ డివిజన్ ఉపజిల్లా వైద్యాధికారి డాక్టర్ అంజన, ఎపిఎంఓ సలీం, ఎం.శంకర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో తనదైన మార్క్

- కమిషనరేట్ పరిధిలో నిబంధనలు తూచా అమలు చేసిన సీపీ కల్మేశ్వర్
- ఆరోపణలు ఉన్న సిబ్బందిపై వేటు
- పైరవీలతో పోలీసుల పోస్టింగులు రద్దు
- బదిలీతో ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్న రాజకీయ నాయకులు, పోలీస్ సిబ్బంది



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ ఐపీఎస్.. విధుల్లో తనదైన మార్క్ చూపించారు. నిబంధనలు తూచా తప్పకుండా అమలు చేస్తూ అక్రమార్కుల ఆట కట్టించారు. ఒక వైపు శాంతిభద్రతలు పర్యవేక్షణ చేపడుతూనే.. మరో వైపు పండుగలు ప్రశాంతవాతావరణంలో జరిగేలా జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి కృషి చేశారు. దుకాణ సముదాయాలకు సమయ వేళలు పాటించడంలో, డీజేల నిషేధంలో నిక్కచ్చిగా వ్యవహరించారు. పోలీస్ సిబ్బంది పనితీరులో సైతం మార్పు తీసుకువచ్చారు. ఏదైనా ఆరోపణలు వస్తే విచారణ చేపట్టి వెంటనే చర్యలకు ఉపక్రమించారు. బదిలీల్లో పైరవీలకు అడ్డుకట్ట వేశారు. ఆయన పనితనం అటు రాజకీయ నాయకులతో పాటు ఇటు పోలీస్ సిబ్బందిలో సైతం ప్రకంపనలు పుట్టించాయని వినికిడి. దీంతో ఆయన బదిలీ కోసం రాజకీయనాయకులు పట్టుబట్టినట్టు చర్చలు వినిపించాయి. ఈ నేపథ్యంలో సీపీ బదిలీ చర్చనీయాంశం అయింది. కాగా కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లాలని లేఖ పెట్టుకోవడంతోనే బదిలీ అయినట్టు సమాచారం.

నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్‌గా కల్మేశ్వర్ తనదైన శైలిలో ముద్ర వేసుకున్నారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా తన విధులలో ముక్కు సూటిగా వ్యవహరించారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ సిబ్బంది ఎవరైతే ఆరోపణలు ఎదుర్కొన్నారో తనదైన శైలిలో విచారణ జరిపించి బదిలీ వేటు వేశారు. మూకుమ్మడిగా 97 మంది పోలీసు సిబ్బందిని బదిలీలు చేయడంతో పోలీస్ శాఖలో అలజడి రేగినట్టయింది. పాతుకుపోయిన కానిస్టేబుల్‌లను తీసివేసి కొత్త వారిని నియమించడంపై ఒక్కసారి ఎవరు ట్రాన్స్‌ఫర్ అవుతారు అని పోలీస్ సిబ్బంది వేచి చూశారు. బదిలీల ఉత్తర్వులు శుక్రవారం వచ్చేసరికి తమ సొంత శాఖ పోలీసులు హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. అదే విధంగా రాజకీయ నాయకులు సైతం ఈ సందర్భం కోసమే వేచి చూశారు. ఇలా ఒకటి కాదు చెప్పుకుంటూ పోతే చాలానే పోలీస్ శాఖను సిపి కల్మేశ్వర్ తనదైన శైలిలో ప్రతి ఒక్కరికి సమాధానం చెబుతూ ముందుకు వెళ్లారు. ఈ మధ్యకాలంలోనే డీజే విషయంలో కూడా అదే తంతు నెలకొంది. ఇప్పటివరకు సీరియస్‌గా పనిచేసిన పోలీసులు జమీందారు ఎలా వ్యవహరిస్తారు ఇలా పని చేస్తారో వేచి చూడాల్సిన పరిస్థితి నిజామాబాద్ జిల్లాలో నెలకొంది. ఇప్పటివరకు వ్యవహరించినట్టు పోలీసులు ఉండి బాగుంటుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలా వ్యవహరించకపోతే లా అండ్ ఆర్డర్ దారి తప్పుతుందని చర్చించుకుంటున్నారు. ఏదేమైనా నిజామాబాద్‌కు మాత్రం కానీ ప్రస్తుతం ఉన్న అధికారులు అదేవిధంగా పనిచేస్తే బాగుంటుంది. లేదంటే వచ్చే పోలీస్ కమిషనర్ పై ఆధారపడి ఉంటుంది.

ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో పోలీస్ కమిషనర్‌గా వచ్చిన కల్మేశ్వర్ సింగెనవార్ సంవత్సర కాలంలో తనదైన శైలిలో శాఖపై పట్టుసాధించారు. అప్పటి సీపీ సత్యనారాయణ గంటల వ్యవధిలోనే బదిలీ కావడంతో హడావుడి వాతావరణంలోనే 2023 అక్టోబర్ 15న రాష్ట్ర 11 గంటలకు కల్మేశ్వర్ సీపీగా బాధ్యత లు స్వీకరించారు. నాటి నుంచి నేటి వరకు నిజామాబాద్ పోలీస్ శాఖ పై తన మార్కును ప్రదర్శించారు. ఆయన పేరు చెబితేనే సొంత శాఖతోపాటు ఇతరుల్లోనూ వణుకు వచ్చే పరిస్థితిని తీసుకువచ్చారు. పైరవీ అంటేనే చిరెత్తిపోయిన ఆయన శాఖలో పైరవీలతో వచ్చిన వారి పోస్టింగ్‌లు ఇవ్వకుండా దూరం పెట్టారు. ఒక వేళ పోస్టింగ్ ఇచ్చినా వారికి కంటి మీద కునుకులేకుండా చేశారు. పొలిటికల్ లీడర్లతోనూ పై పై సరే అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో పోస్టింగ్ తెచ్చుకున్న అధికారులకు చుక్కలు చూపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అడగడంతో సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపేందుకు రైతులతో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించేందుకు పోలీసుశాఖ అనుమతికోరగా, సీపీ నిరాకరించారు. ఈ విషయంలో సదరు ఎమ్మెల్యే.. సీఎం రేవంత్ రెడ్డికి నేరుగా ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ జిల్లాలో పలు పోస్టింగ్‌లను ఓ రాజకీయ నాయకుడి ద్వారా వచ్చిన విషయం తెలిసి కల్మేశ్వర్ వారికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఇక్కడున్న వారిని రిలీవ్ చేయలేదు. సరిగ్గా నెల రోజుల తరువాత అవే ఉత్తర్వులు రావడంతో పోలీసుశాఖలో ఆలజడి మొదలైంది. అప్పటి నుంచే కమిషనర్ కల్మేశ్వర్ బదిలీ అవుతారని చర్చ ప్రారంభమైంది. అదే సమయంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సైతం ఉన్నతాధికారులకు తమ బదిలీ విషయం పెట్టుకున్నట్టు తెలిసింది.

గతంలో సెటిల్మెంట్ దందాలకు పాల్పడిన సిబ్బందిపై సీపీ కల్మేశ్వర్ ఓ కన్నేసి ఉంచారు. నిఘా విభాగాలతో పాటు టాస్క్ ఫోర్స్ ను సైతం సీపీ తనదైన శైలిలో హడలెత్తించారు. పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు, రంజాన్, వినాయకచవితి, దసరా నవరాత్రులను శాంతియు వాతావరణంలో నిర్వహించారు. పోలీస్ శాఖలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేసేందుకు కృషి చేశారు. అదే సమయంలో శాఖ ప్రక్షాళన దిశగా అడుగులు వేశారు. టాస్క్ ఫోర్స్ ప్రక్షాళనే ఇందుకు ఉదాహరణగా నిలిచింది.

ఇసుక, మొరం మాఫియాపై జిల్లాలో తొలిత మోకం ఇసుక మాఫియాపై నజర్ చేసిన కమిషనర్ 143 మంది తో షీట్ తెరిచారు. వారందరినీ పిలిపించి వార్నింగ్ ఇవ్వడం పాటు బైండోవర్ చేశారు. వారి తరువాత రౌడీషీటర్లు కమ్యూనల్ సస్పెక్ట్‌లకూ ఇదే విధమైన కౌన్సెలింగ్ ఇచ్చారు. తాజాగా ల్యాండ్ సెటిల్మెంట్‌లతో పాటు కబ్జాల కేసులు నమోదైన వారికి కౌన్సిలింగ్ చేస్తున్నారు. అదే వ్యవహారం ప్రతిపక్ష బీఆర్ఎస్ తోపాటు అధికార కాంగ్రెస్ నాయకులకు నచ్చడం లేదు. ఇదిలా ఉండగా పోలీస్‌స్టేషన్ లలో పాతుకు పోయిన మధ్యతరగతి స్థానచలనం కలిగించారు. 48 గంటల్లో 97 మందిని బదిలీ చేశారు. సీపీ కల్మేశ్వర్ హయాంలో జరిగినన్ని సీఐలు, ఎస్సైలకు మెమోలు జారీ, అటాచ్ మెంటలు ఇప్పటి వరకు మరే అధికారి హయాంలో జరగకపోవడం గమనార్హం, కమిషనర్ బదిలీ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన సిబ్బంది, రాజకీయ నాయకులు అప్పుడు సీపీ బదిలీతో ఊపిరిపీల్చుకున్నారు.

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్, ఏవో బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని కేంద్ర సర్వీసులకు డిప్యూటేషన్ పై పంపుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రూప్-2, 3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా కలెక్టర్ వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీ.జీ.పీ.ఎస్.సీ) ద్వారా నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహించనున్న గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. నవంబర్ 17, 18 తేదీలలో జరిగే గ్రూప్-3 పరీక్షలు, డిసెంబర్ 15, 16 తేదీలలో నిర్వహించనున్న గ్రూప్-2 రాత పరీక్షలను పురస్కరించుకుని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్ రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, ప్రాంతీయ సమన్వయకర్తలతో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5.50 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్న దృష్ట్యా ఇప్పటినుండే పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా, ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 72 పరీక్ష కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ఇప్పటికే ఆర్డీఓలు ఈ కేంద్రాలను సందర్శించి వసతి సదుపాయాలను పరిశీలించారని అన్నారు. గ్రూప్స్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు, ఇతర మెటీరియల్ ను కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య భద్రపరిచేందుకు ఆర్.డీ.ఓ.సీలో ఒకటి, పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో మరొకటి చొప్పున మొత్తం రెండు స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఈ నెల 22 వ తేదీ లోపు స్ట్రాంగ్ రూమ్ లను సంబంధించిన పూర్తి వివరాలను సమర్పిస్తామని, పరీక్షా కేంద్రాల వివరాలను కూడా ఆన్లైన్ ద్వారా పంపిస్తామని అన్నారు. ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమిస్తామని, అవసరమైతే ఇతర శాఖల సహకారం తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి ఆటంకాలకు తావులేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్తలు రాంమోహన్ రావు, సాయిరెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ సిటీ : పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి: కామారెడ్డి జిల్లాలో గ్రూప్ 3 పరీక్షకు 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు, 8300 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు, ఈ పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, డిఎస్పీ నాగేశ్వర్ రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, రీజనల్ కో ఆర్డినేటర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి

పెర్కిట్‌లో విషాద ఛాయలు

నవతెలంగాణ-ఆర్మూర్



మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన వుప్పుల సుమన్ (35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. జిల్లా కేంద్రంలోని తూనికలు కొలతల శాఖ యందు గత ఐదు నెలల క్రితం కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం వచ్చింది. సుమన్ గురువారం విధులు నిర్వహించుకొని ఆర్మూర్ కు వస్తుండగా రామచంద్రపల్లి జాతీయ రహదారి దగ్గర వెనుక నుండి వేగంగా వస్తున్న కారు ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందారు. ఈయన తండ్రి వుప్పుల హనుమన్లు ప్రభుత్వ టీచర్ కాగా, గత రెండు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు. కాగా తండ్రి, కొడుకు సైతం రోడ్డు ప్రమాదం లో మరణించగా అంత్యక్రియల్లో కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

35వ వార్డ్‌ను పరిశీలన

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని 35వ వార్డ్‌లో భవానీనగర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంతకు ముందు గుంతలున్న దగ్గర మొరం వేయాలని, కాలనీకి వచ్చే వెళ్లే ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్ పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీకృష్ణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధ ప్రతిపాదికన ప్రారంభించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

ధాన్యం కొనుగోలు కేంద్రాలను, యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని, ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యవర్గం డిమాండ్ చేసింది. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ కార్యాలయం కుమార్ నారాయణ భవన్‌లో శుక్రవారం అధ్యక్షులు .సురేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి బి. దేవారం హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి బి దేవారం. అధ్యక్షులు సారా సురేష్, కార్యదర్శి, గుమ్ముల గంగాధర్ సమావేశ తీర్మానాలను వివరించారు. అక్టోబర్ మొదటి వారంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ప్రకటించి రెండు వారాలు గడిచిన 8 కొనుగోలు కేంద్రాలు మాత్రమే ప్రారంభించారన్నారు. వాటికి గన్ని సంచులు, లారీల కొరత కొట్టొచ్చినట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేక వ్యాపారులకు ఎమ్ఎస్‌పీ ధర కన్నా 100 నుంచి 200 తక్కువ చొప్పున అమ్ముకోవాల్సి వస్తుందని తెలిపారు. దొడ్డు సన్నధాన్యాలకు 500 రూపాయలు ఇవ్వాలని, ధరణి సమస్యలు, పోడు భూములను పరిష్కరించాలని, రేషన్ కార్డులను వెంటనే ఇవ్వాలని, రైతులు, వ్యవసాయ కూలీలకు నెలకు 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్‌తో ఈ నెల 20 నుండి 30 వరకు మండల కేంద్రాలు, జిల్లా కేంద్రంలో ఆందోళనలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణఆర్మూర్



ఆర్థికసాయం అందజేస్తున్న రాజశేఖర్

పట్టణానికి చెందిన పి.శశాంక్ బిబిఏ చదువు కోసం ఈరవత్రి రాండాస్ ఫౌండేషన్ చైర్మన్, చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో రూ. 20 వేలను అందజేశారు. పట్టణంలోని సిఏ రాజశేఖర్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. పట్టణానికి చెందిన శశాంక్ హైదరాబాద్ లోని ఐ క్రియేట్ కళాశాలలో బిబిఏ ఫైనలియర్ చదువుతున్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేక చదువు మధ్యలో మానేసే పరిస్థితి వచ్చిందని తెలుసుకొని ఈరవత్రి రాండాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేయడానికి ముందుకొచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థి శశాంక్ చదువు మధ్యలో ఆగకుండా ఆర్థిక సహాయం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సదాక్ ప్రమోద్, బదాం రాజ్ కుమార్, సిరిగిరి జీవన్, ఈరవత్రి సురేందర్, హజారి సతీష్, దాసరి గోపీకృష్ణ, ప్రవీణ్, సాయి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ బాలికల పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 18 నుండి 20 వరకు వరంగల్ జిల్లాలో జరుగుతున్న 9వ రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు శుక్రవారం బయలుదేరినట్టు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ తెలిపారు.

గత నాలుగు రోజులుగా డిచ్ పల్లి మండలం లోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల లో జరిగిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల ప్రిన్సిపల్ బీరప్ప నళిని పాల్గొని క్రీడాకారిని ఉద్దేశించి మాట్లాడుతూ శారీరక, మానసిక ఎదుగుదలను ఉత్తేజపరిచే క్రీడా కార్యకలాపాలు ముఖ్యంగా పిల్లలకు చాలా అవసరమని, ఇది పిల్లల జ్ఞాపకశక్తి స్థాయి, ఏకాగ్రత స్థాయి, అభ్యాస సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని వివరించారు. చిన్ననాటి నుండి క్రీడల్లో పాల్గొంటే ప్రసిద్ధ జాతీయ లేదా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు కావచ్చని పేర్కొన్నారు. పిల్లలు తమ పాఠశాలలు, కళాశాలలలో జరిగే అన్ని క్రీడా పోటీలలో పాల్గొనాలని సూచించారు. మంచి క్రీడాకారులకు భవిష్యత్తులో మంచి కెరీర్‌ను క్రీడల ద్వారా పొంది ఉన్నత స్థాయికి ఎదిగిన దాఖలాలు ఉన్నాయని, ఇవి మనకు జీవితంలో ఎదగడానికి, పేరు, కీర్తిని సంపాదించడానికి కూడా అవకాశాన్ని ఇస్తుందని సూచించారు. ప్రస్తుతం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని దాదాపు అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ముఖ్యంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో క్రీడా సౌకర్యాలు అభివృద్ధి చేయబడుతున్నాయని వివరించారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటలల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ వైస్ ప్రిన్సిపల్ మైలెని స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ వనిత మేనేస్, సాఫ్ట్ బాల్ అకాడమీ కోచ్ వి మౌనిక, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీలత, సీనియర్ క్రీడాకారులు భల బాయ్, సౌమ్యరాణి పాల్గొన్నారు.

ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని కొక్కొండ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం సమావేశంలో మండల అధ్యక్షులు ఎల్ల కిషన్ ఆధ్వర్యంలో కొక్కొండ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా అల్లాపురం సాయిలు, ప్రధాన కార్యదర్శిగా నడిమి దొడ్డి గంగారం, ఉపాధ్యక్షులుగా సైదులు, కోశాధికారి సుదర్శన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కంతి వెంకన్న, డివిజన్ కార్యదర్శి మహేందర్, కార్యదర్శి శివనంద్, టౌన్ అధ్యక్షులు నరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటి నాణ్యత పరిశీలన

నవతెలంగాణ-ఆర్మూర్



నీటి నమూనాలు సేకరించిన అధికారులు

విశ్వసమిత్రా సోలార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు పట్టణంలో మల్లారెడ్డి చెరువు, గుండ్ల చెరువు, పెర్కిట్ చెరువుల నీటి నాణ్యతను పరిశీలించడం కోసం నీటి నమూనాలు శుక్రవారం తీసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూమేశ్వర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణిమ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | అక్టోబర్ 19, 2024 | www.navatelangana.com

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో శుక్రవారం ఇటీవల కాలంలో నియామకమైన గ్రంథాలయ సంస్థ చైర్మన్ డిసిసి ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్‌రెడ్డిని వికలాంగుల జిల్లా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బాల్‌రెడ్డి, సిద్ధరాములు, రాజమౌళి, నాగరాజు, అంజయ్య, సిద్ధాగౌడ్, మల్లన్న, ప్రకాష్, శ్రీను బాబు, రాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్‌ను సన్మానిస్తున్న వికలాంగులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని వివిధ గ్రామాల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల మదన్మోహన్‌రావు సూచన మేరకు లబ్ధిదారులకు శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. రంగంపేట, రామారెడ్డి, గోకుల్‌తాండ, కన్నాపూర్, కన్నాపూర్ తండాలలో అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి ఏడు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, చింతకుంట కిషన్, కిషన్ యాదవ్, నరేందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న నాయకులు

అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు

- కలెక్టర్‌లు రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి
- అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని హితవు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ) దోహదపడతాయని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఆయా జిల్లాలలో నెలకొల్పిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశాలకు సంబంధించిన ప్రగతిపై శుక్రవారం ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఏటీసీ కేంద్రాలను అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని, ఈ నెలాఖరు లోపు పూర్తి స్థాయిలో ప్రవేశాలు జరిగేలా చొరవ చూపాలని సూచించారు.

వీ.సీ అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేయాలని, ఏటీసీ కేంద్రాల గురించి అవగాహన పెంపొందించేందుకు వీలుగా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఏటీసీ కేంద్రాలలో శిక్షణ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఒకటిరెండు రోజుల్లోనే తాను క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలిస్తానని అన్నారు.

తొలి విడతగా జిల్లాలోని నిజామాబాద్, బోధన్, కమ్మర్‌పల్లిలో ఏటీసీ కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఐ.టీ.ఐ ప్రాంగణాలలోనే ఏటీసీ కేంద్రాలను కొనసాగిస్తూ, ఆయా కోర్సులలో శిక్షణను ప్రారంభించుకోనున్నామని, త్వరలోనే అన్ని వసతులు, సదుపాయా లతో నూతన భవనాలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. ఏటీసీ కేంద్రాలలో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ (ఒక సంవత్సరం కాల వ్యవధి) కోర్సు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్స్ (ఒక సంవత్సరం), ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్ (ఒక సంవత్సరం), బేసిక్ డిజైనర్ అండ్ వర్చ్యువల్ వెరిఫైర్-మెకానికల్ (రెండు సంవత్సరాలు), అడ్వాన్స్ సీ.ఎన్.సీ మషీనింగ్ టెక్నీషియన్ (రెండు సంవత్సరాలు), మెకానిక్ ఎలెక్ట్రిక్ వెహికల్ (రెండు సంవత్సరాలు) కోర్సులలో శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఈ కోర్సులను పూర్తి చేసుకున్న వారికి వారి సామర్థ్యాన్ని బట్టి వివిధ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, ప్రభుత్వరంగ సంస్థల్లోనూ ఉద్యోగాలు పొందేందుకు ఈ అధునాతన కోర్సులు దోహదపడతాయని కలెక్టర్ సూచించారు. స్వయం ఉపాధిని ఏర్పర్చుకుని పారిశ్రామికవేత్తలుగా స్థిరపడవచ్చని అన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సులలో చేరేందుకు అర్హులని తెలిపారు. ఎస్సెస్సీ మెమో, టీ.సీ, కుల ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్, ఆధార్ కార్డుతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని సూచించారు. ప్రవేశాలకు ఈ నెల 31 చివరి తేదీ అయినందున గడువులోపు అర్హత, ఆసక్తి కలిగిన వారు ఏటీసీ కేంద్రాలలో నిర్దేశిత కోర్సులలో ప్రవేశాలు పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని పని దినాలలో ఉదయం 9.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిజామాబాద్ ప్రభుత్వ బాలుర(పాత) ఐ.టీ.ఐ, బోధన్ ప్రభుత్వ ఐ.టీ.ఐ, కమ్మర్పల్లి ప్రభుత్వ ఐ.టీ.ఐలో ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా కార్మిక శాఖ అధికారి యోహాన్, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, సంబంధిత ఐ.టీ.ఐ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి : అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లలో నూతన కోర్సుల్లో అడ్మిషన్‌లను వేగవంతం చేయాలని కార్మిక, ట్రైనింగ్ ఫ్యాక్టరీ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లాల కలెక్టర్లు, ఐటిఐ ప్రిన్సిపల్స్ తో కార్మిక, ఎంప్లాయిమెంట్ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లలో కొత్తగా ఆరు కోర్సులను ప్రారంభించామని, అడ్మిషన్‌ల ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. జిల్లాల వారీగా అడ్మిషన్ల ప్రక్రియను ఆయన సమీక్షించారు. ఇందుకు ఆయా జిల్లాల కలెక్టర్లతో కలిసి విస్తృత ప్రచారం చేసి వెంటనే అడ్మిషన్స్ పూర్తిచేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలో ఆరు కోర్సులకు సంబంధించిన సీట్ల వివరాలను ప్రచారం చేయాలని, విద్యార్థులకు అవగాహన కల్పించి అడ్మిషన్లను పూర్తి చేయాలని ఐ.టీ. ఐ. ప్రిన్సిపల్స్ లను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఐ.టీ. ఐ. కన్వీనర్ జి. ప్రమోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంగళ్‌పాడ్‌లో గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పాడు గ్రామంలో శనివారం గేదెలకు, ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్టు పశువైద్యాధికారి ప్రమోద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకనటలో తెలిపారు. పాడి రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని సూచించారు.

బదిలీపై వెళ్లిన విద్యుత్ శాఖ ఉద్యోగులకు సన్మానం



సన్మానం పొందిన ఉద్యోగులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండల పరిధిలో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్తున్న విద్యుత్‌శాఖ ఉద్యోగులను శుక్రవారం ఎల్లారెడ్డి మండల పరిధిలోని లక్ష్మంపూర్ గ్రామ సబ్ స్టేషన్ వద్ద లక్ష్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎల్లారెడ్డి ఏఇగా లక్ష్మి నారాయణ గౌడ్, లైన్మెన్ లింబు నాయక్‌కు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. సుదీర్ఘ కాలం పాటు ఎల్లారెడ్డి ప్రాంత ప్రజలకు అందించిన సేవలను గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్, పిఎసిఎస్ డైరెక్టర్, గ్రామ ఎక్స్ సర్పంచులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య సూపర్వైజర్ రాజామణి తెలిపారు. మండల కేంద్రంలో ఫ్రైడే-డ్రైడే సందర్భంగా ఆశా కార్యకర్తలతో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శ్యామల, ఆశా కార్యకర్తలు రేణుక, వనజ పాల్గొన్నారు.



నిల్వ నీటిని తొలగిస్తున్న అధికారులు

ఇసుక ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రం సమీపంలోని బైపాస్ రహదారి మూలమలుపు వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీకొని తగ్గెల్లి గ్రామానికి చెందిన సాయిగౌండ (60) తీవ్ర గాయాలకు గురయ్యాడు. తగ్గెల్లి గ్రామానికి చెందిన సాయిగౌండ బోధన్ నుంచి తన ద్విచక్ర వాహనంపై తగ్గెల్లికి వెళ్తుండగా సాలూర బైపాస్ రోడ్డు మూలమలుపు వద్ద మందర్న గ్రామం నుండి వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా గాయల పాలైన సాయి గొండను బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్య సేవల కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రం ఆసుపత్రికి తరలించారు.

న్యూసెన్స్ కేసులో ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల గ్రామానికి చెందిన గోసుల సాయినాథ్, మమ్మాయి శివశంకర్ 100కు డయల్ చేసి తాగిన మైకంలో న్యూసెన్స్ చేయగా.. వారిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచామని రెంజల్ ఎస్సై ఈ.సాయన్న పేర్కొన్నారు. శుక్రవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా.. ఒక్కొక్కరికి రూ.50 జరిమానా విధిస్తూ, ఒకరోజు జైలుశిక్ష విధించిందని ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

- ట్రాన్స్‌కో ఏఈ రాజలింగం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని రెంజల్ ఎస్ఎస్, దండిగుట్ట ఎస్ఎస్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు స్థానిక విద్యుత్ ఏఈ రాజలింగం తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ఆయా సబ్‌స్టేషన్ పరిధిలో గల వినియోగదారులు, పరిశ్రమల వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు తెలియపరచాలని అలాగే విద్యుత్ మరమ్మతులను సమయానుకూలంగా పూర్తిచేసి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

ఎల్ఆర్ఎస్ క్షేత్ర స్థాయి ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.జ్యోతి అధికారులకు సూచిం చారు. దోమకొండ మండల కేంద్రంలోని ఎల్ఆర్ఎస్ పక్రియ, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ధాన్యం అరబెట్టడానికి టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంజయ్ రావు, ఎంపిడివో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

విద్యా మండలి వైస్ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటుకల పురుషోత్తంను నాగిరెడ్డిపేట్ మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి శుక్రవారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పురుషోత్తంను తెలంగాణ ప్రభుత్వం వైస్ చైర్మన్‌గా నియమించడం పట్ల అతని కలిసి సన్మానించినట్లు జెడ్పిటిసి పేర్కొన్నారు.

సొంత డబ్బులతో రోడ్డు మరమ్మతులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావుపేట్ రైతులు స్వంత డబ్బులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. లింగంపల్లి, ధర్మారావుపేట్ గ్రామాల లింక్ రోడ్డు ఉంది. ఆ రోడ్డుకు ఇరువైపులా రైతులకు పొలాలున్నాయి. వర్షాలకు కల్వర్టు వద్ద మట్టికొట్టుకుపోయింది. రైతులకు రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వం మరమ్మతులు చేయకపోవడంతో రైతులు రూ.30వేలతో రోడ్డును బాగు చేసుకున్నారు. ప్రభుత్వం స్పందించి రెండు గ్రామాల మధ్య తారు రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.



విద్యుత్ వాడకంలో జాగ్రత్తలు ముఖ్యం

- రైతు పొలం బాటలో డిఈ విజయ సారథి

నవతెలంగాణ-లింగంపేట్

రైతులు తమ పంట పొలాల వద్ద విద్యుత్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో డిఈ విజయ సారథి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పరమళ్ల గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విద్యుత్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా పలు సూచనలు చేశారు. విద్యుత్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. రైతులు తమ మోటార్లకు కెపాసిటర్లను బిగించుకోవాలన్నారు. విద్యుత్ వైర్లు కిందకి వేలాడితే వెంటనే విద్యుత్ శాఖ లైన్మెన్‌లకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే వెంటనే సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడిఈ మల్లేశం, ఏఈలు హరీష్‌రావు, సాయినాథ్, సబ్ ఇంజనీర్ అశోక్, లైన్మెన్లు పాండు, రాములు, హైమద్, హంబీర్య తదితరులు పాల్గొన్నారు.



పొలంబాటలో పాల్గొన్న అధికారులు, రైతులు

ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలి

- గ్రామీణ నీటిపారుదల శాఖ డిఈఈ మున్నీనాయక్

నవతెలంగాణ-బోధన్

గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించడానికి గ్రామపంచాయతీ సిబ్బంది మంచినీటి సహాయకులు కృషి చేయాలని నీటిపారుదల శాఖ డిఈఈ మున్నీనాయక్ సూచించారు. గత నాలుగు రోజులుగా మంచినీటి సహాయకులకు బోధన్ ఆర్ డబ్ల్యూఎస్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలలో ఉన్న కుళాయిలను, చేతి నీటి పంపులను మరమ్మతులు చేయడం వాటి నిర్వహణ సక్రమంగా ఉండేలా చేయడం మంచినీటి సహాయకుల బాధ్యత అని అన్నారు. కాలనీలలో తాగునీటి కొరత లేకుండా ప్రజలకు అందుబాటులో నీరు అందేలా చూడాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన మంచినీటి సహాయకులకు ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇంట్రా ఏఐ అనిల్‌కుమార్, ఎంపీడీవో బాలగంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మంచినీటి సహాయకులకు ధృవపత్రాలు అందిస్తున్న డీఈఈ

యోగాలో ప్రతిభచూపిన విద్యార్థులకు సబ్ కలెక్టర్ అభినందన

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ యోగాసన క్రీడా అసోసియేషన్ (టివైఎస్ఏ) ఆధ్వర్యంలో పటాన్ చెరులో నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి యోగాసన పోటీలలో ప్రతిభ కనబర్చిన బోధన్ పట్టణంలోని విజయ సాయి హైస్కూల్ విద్యార్థులను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో శుక్రవారం అభినందించారు. విద్యార్థులు ఎస్.తేజస్, కపిల్ ఎతేవాతర్ రావు, వి.క్రాంతి, ఐ.ఓంకార్ అండర్ జూనియర్ బాయ్స్ విభాగంలో ప్రతిభ కనబరిచినందున జ్ఞాపికలు, ప్రసంసాపత్రాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో మాట్లాడుతూ యోగాకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందన్నారు. యోగాసనాల ప్రయోజనాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థుల్లో యోగాసనాలపై మక్కువ పెరగడం అభినందనీయమన్నారు. అస్సాంలో జరగనున్న పోటీలలో విద్యార్థులు పాల్గొని ఆ పోటీలలో కూడా మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజయసాయి హైస్కూల్ ప్రిన్సిపల్ కృష్ణ మోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి, యోగ గురువు సాయిలు తదితరులున్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సబ్ కలెక్టర్

పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను పరామర్శించిన సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

పోలీసు అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా కమిషనరేటు పరిధిలో అమరులైన పోలీసు కుటుంబ సభ్యులను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది వారి కుటుంబసభ్యులను కలిసి అమరుల ఫోటోలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబసభ్యులతో ప్రభుత్వం నుంచి అందిన సహాయ సహకారాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైన ప్రభుత్వం నుండి సహకారం కావాల్సిన, ఇంకా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అమరులైన పోలీస్ కుటుంబాలకు అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, వారి బాగోగులు పర్యవేక్షించాలని తెలిపారు. వారి కుటుంబాలకు ఎల్లవెలల సహాయ సహకారాలు అందిస్తామని సమస్యలు ఉంటే పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యాక్రమంలో అదనపు డిప్యూటి కమిషనర్ ఆఫ్ పోలీస్ అడ్మిన్ కోటేశ్వరరావు, ఎస్ఐబి ఇన్స్పెక్టర్ ఎస్. సత్య ప్రసాద్, టౌన్ సిఐ శ్రీనివాస్ రాజ్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీ